క్లుప్తంగా

కేజీహెచ్ ట్రైబల్ సెల్ ఆకస్మిక తనిఖీ



కేజీహెచ్ ట్రైబల్ సెల్‌లో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న డాక్టర్ జమాల్ బాషా

మహారాణిపేట : కేజీహెచ్‌లోని ట్రైబల్ సెల్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా (ఏఎస్ఆర్) వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ల రిజిస్టర్లు, బ్లడ్ బ్యాంకు, మందుల పంపిణీ వివరాలు, గిరిజనులకు అందుతున్న పలు సేవలను పరిశీలించారు. అనంతరం డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. రోగుల పరిస్థితిని వారితో వచ్చిన బంధువులకు వివరించాలని వైద్యులకు, సిబ్బందికి తెలిపారు. వైద్య సేవల్లో భాగంగా ఎలాంటి నిర్లక్ష్యానికి తావీయరాదని తెలిపారు. ఈ తనిఖీల్లో డాక్టర్ రవీంద్ర, డాక్టర్ సంపత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు ప్రజాస్వామ్య నిర్దేశకులు



మాట్లాడుతున్న దక్షిణ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి కదిరి రాము

దాబాగార్డెన్స్ : న్యాయవాదులు ప్రజాస్వామ్య నిర్దేశకులని ప్రముఖ న్యాయవాది, దక్షిణ నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి కదిరి రాము తెలిపారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదుల కలయికలో ఆయన మాట్లాడారు. సాటి న్యాయవాదినైన తనను ఎన్నికల బాలెట్ సీరియల్ నంబరు-1 ఏనుగు గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజల రాజ్యాధికారమే లక్ష్యంగా కాన్షీరామ్ నేతృత్వంలో పూలే, అంబేడ్కర్ ఆశయ సాధనకు బీఎస్పీ ఏర్పడిందన్నారు. ఇతర పార్టీలకు భిన్నంగా సామాన్యులు స్వేచ్ఛగా, ఎలాంటి ప్రతిబంధకాలు లేకుండా జీవించేలా సమాజాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో తమ పార్టీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దంతి నరేష్‌కుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరికి ఘన నివాళి




విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్

జగదాంబ : స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో మంగళవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ అల్లూరి దేశం కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. అటువంటి పోరాటి పటిమతో విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధించాలన్నారు. అనంతరం ట్యూషన్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

డెవలప్‌మెంట్ వాచ్

కాలుష్యానికి కత్తెర



కాలుష్య కోరల్లో నుంచి నెమ్మదిగా బయటపడుతున్న పాతనగరం

- పాతనగరంలో తిష్ట వేసిన ప్రధాన సమస్యకు చెక్
- అలుపెరుగని పోరాటం చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గంలో కాలుష్య సమస్య తీవ్రంగా ఉండేది. ఎటుచూసినా నల్లటి బొగ్గుతో నిండిన భవనాలు.. రహదారులు కనిపించేవి. ఎంతో మంది రోగాలతో మృత్యువాత పడగా, మరి కొంత మంది దీర్ఘకాలిక రోగాలతో దయనీయంగా బతుకులు ఈడ్చే పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అలుపెరుగని పోరాటం చేశారు. పోర్టు యంత్రాంగంతో చర్చలు జరిపి సఫలీకృతులయ్యారు. దీంతో కాలుష్య నివారణలో భాగంగా ప్రతిరోజూ వాటరింగ్ చేయించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. మూడు కిలోమీటర్ల మేర 50 అడుగుల రోడ్డు నిర్మాణం, ఆపై నెట్ వేయించారు. బొగ్గు ప్రబలకుండా టార్పాలిన్లు వేయించారు. లక్షలాది మొక్కలు పోర్టు పరిసర ప్రాంతాల్లో నాటించారు. గాలిలో పొల్యూషన్ శాతం పెరిగితే తెలిసేలా మూడు పొల్యూషన్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేయించారు. అత్యాధునిక పద్ధతులతో తీసుకున్న చర్యల వల్ల పొల్యూషన్‌కు బ్రేక్ పడింది. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న దక్షిణలో కాలుష్య సమస్యకు పరిష్కారం దొరికినట్టయింది.



పాతనగరంలో కాలుష్యానికి చెక్ పెట్టేలా యార్డు గోడలకు టార్పాలిన్లు ఏర్పాటు చేసిన దృశ్యం



కాలుష్యానికి కారణమయ్యే భారీ వాహనాలు జనావాసాల్లోకి రాకుండా 3 కిలోమీటర్ల మేర నిర్మించిన 50 అడుగుల రోడ్డు



కాలుష్యం బయటికి వెదజిమ్మకుండా సీల్డ్ కోల్‌బెల్ట్ నిర్మాణం

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన జగన్నాథ రథ సేవకులైన జాలర్లతో వాసుపల్లి

అల్లిపురం : వైఎస్సార్‌సీపీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. వివిధ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు, పలు ప్రాంతాల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, అందజేసిన సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారంతా ప్రకటించారు. తాజాగా జగన్నాథ స్వామి రథ సేవకులు, 30, 37 వార్డుల జాలర్లు దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆశీలమెట్ట కార్యాలయంలో పెయిన్‌దొర పేటకు చెందిన జగన్నాథ రథ సేవకులైన 20 మంది జాలర్లు సోమవారం పార్టీలో చేరి వాసుపల్లికి మద్దతు పలికారు. వారికి కండువాలు కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చింతపల్లి తాతాజీ, కె. నూకరాజు, సీహెచ్ సత్తిరాజు, ఎస్. రాము, సత్తిరాజు, జగ్గా చిన్న, సత్తి, శివ, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రాంతం ఏదైనా సీఎం జగన్ ఎలాంటి వివక్షకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. వాసుపల్లి సేవలకు మెచ్చి ఆయన వెంట నడిచేందుకు పార్టీలో చేరామన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన..

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.10 వేలు చెల్లించినచో వారి తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచార పర్వం



వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు వాసుపల్లి రాశి జీవీఎంసీ 39వ వార్డు ఇన్‌చార్జి కొల్లి సింహాచలంతో కలిసి చిలకవీధి, గానుగలవీధి, వాడవీధి ప్రాంతాల్లో ప్రచారం చేశారు.



జీవీఎంసీ 35వ వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి మంగళవారం లక్ష్మీనగర్, స్ప్రింగ్‌రోడ్డు, పూర్ణామార్కెట్, నూనెమిల్లు వీధి, గాజుల వీధి, రామకృష్ణా జంక్షన్, కల్లుపాకలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదివిష్ణురెడ్డి, వాసర్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము ఆధ్వర్యంలో మిరపకాయల వీధి, గోవింద్ రోడ్డు, నారాయణ వీధి, సాయిబాబా వీధి తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, అభిమానులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.





వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట తదితర ప్రాంతాల్లో నాయకులు కణితి బ్రహ్మం, పిల్లి శివ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బోర విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. బోర శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వాసుపల్లి తనయుడు సాకేత్, మండల అధ్యక్షుడు పీతల వాసు 29వ వార్డులోని ఆంథోనీనగర్, రామజోగిపేట, జిల్లా పరిషత్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు.

- దాబాగార్డెన్స్, అల్లిపురం, జగదాంబ

విజయబావుటా ఎగరేస్తాం..

- జగనన్న చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది
- ప్రజల ఆదరణే అందుకు నిదర్శనం
- దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్
- 27వ వార్డులో ముమ్మర ప్రచారం



బొత్స ఝాన్సీలక్ష్మి, వాసుపల్లి గణేష్‌కుమార్‌లను గజమాలతో సత్కరిస్తున్న 27వ వార్డు నాయకులు



ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగరేసి.. మరోసారి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావటం ఖాయమని దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 27వ వార్డులో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ మేరకు 27వ వార్డు పార్టీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా బొత్స ఝాన్సీ, వాసుపల్లికి స్థానిక నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. అంబేడ్కర్ భవన్ వద్ద ప్రసిద్ధి గాంచిన శ్రీసిద్ధి వినాయక కాశీ విశ్వనాథ స్వామి, విశాలక్ష్మి ఆలయంలో అభ్యర్థులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. వర్షం కురుస్తున్నప్పటికీ నాయకులు ప్రచారం కొనసాగించారు. స్థానికులు కూడా వర్షానికి వెరవక నాయకులకు ఆత్మీయంగా స్వాగతం పలికారు. వారే స్వయంగా జగనన్నకే మా ఓటు అంటూ నినాదాలు చేస్తూ నాయకులను ఆనందపరవశులను చేశారు.



పార్టీ నాయకులతో కలిసి 27వ వార్డులో ప్రచారానికి వస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జగనన్న నవరత్నాలు అందుకున్న ప్రతి గడప ప్రచారంలో తమను దీవిస్తుండడం చూస్తుంటే వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని అర్థమవుతుందన్నారు. జగనన్న పైన వారికుండే ప్రేమను తనపై చూపడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. దక్షిణలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఎంత మంది కలిసి వచ్చినా ఫ్యాన్ ప్రభంజనానికి తిరుగు లేదన్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీకి తమ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



వాసుపల్లి, పార్టీ నాయకులపై పూలవర్షం

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

హోం ఓటింగ్ పక్కాగా నిర్వహించాలి



హోమ్ ఓటింగ్‌పై నోడల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో మయూర్ అశోక్

మహారాణిపేట: హోం ఓటింగ్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు. హోం ఓటింగ్‌పై నోడల్ అధికారులు, హోం ఓటింగ్ బృందాలు, సెక్టార్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. హోం ఓటింగ్ ప్రక్రియపై అధికారులకు అవగాహన అవసరమన్నారు. హోం ఓటింగ్ బృందాలు అనుసరించాల్సిన విధి విధానాలు, మార్గదర్శకాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ ఓటింగ్‌లో వయో వృద్ధులు (85 సంవత్సరాలు పైబడినవారు), దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేయనున్నందున సహనంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలు సమష్టిగా పని చేయాలన్నారు. హోమ్ ఓటింగ్‌కు ఒక బాక్సు తీసుకువెళతారని, ఆ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున ఏజెంట్లు ఉండేందుకు అవకాశం కూడా కల్పించినట్లు ఆర్‌వో వివరించారు. మంగళ, బుధవారాల్లో ఈ హోమ్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని, అందుబాటులో లేని వృద్ధులు, దివ్యాంగులు కోసం గురువారం మరో అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు, హోం ఓటింగ్ బృందాలు, సెక్టార్ అధికారులు, వివిధ రాజకీయ పక్షాలు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో.. ఉపశమనం



వర్షమైనా బతుకు పోరు తప్పదుగా..

అల్లిపురం : మంగళవారం కురిసిన భారీ వర్షంతో నియోజకవర్గంలో కాలువలు, గెడ్డలు పొంగి పొర్లాయి. రోడ్లు జలమయమయ్యాయి. దొండపర్తి, అల్లిపురం, దాబాగార్డెన్స్, సరస్వతీ జంక్షన్, రామకృష్ణా జంక్షన్, చావుల మదుం, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. చావులమదుం వద్ద నడుం లోతు వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించారు.